సాక్షి
తిరుపతి
శనివారం । 21 । డిసెంబర్ । 2024



ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించండి

ఖాదీ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. -IIలో



ముగిసిన శిక్షణ

తిరుపతి శ్వేత భవనంలో ఐదు రోజుల పాటు జరిగిన న్యాయమూర్తుల శిక్షణ శుక్రవారం ముగిసింది. -IIలో



అధికారంతో తమ్ముళ్ల అరాచకం

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. రైతుల భూముల్లోని పంటలను సైతం నాశనం చేస్తున్నారు. -IIలో

న్యూస్‌రీల్

కార్గో పరిధి పెంచాలి



ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: కార్గో డోర్‌డెలివరీ సర్వీసులు కేవలం తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, పుత్తూరు డిపోలకే కాకుండా జిల్లాలోని 11 డిపోల నుంచి అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్టీసీ అధికారులతో కలసి కార్గో డోర్‌డెలివరీ మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో ఆర్టీసీ ఆధారంగా రోజు వారి ప్రయాణికుల వివరాలను తెలియజేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోజుకు 5 లక్షల మందికి పైగా ఆర్టీసీ ఆధారంగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని, జిల్లాలోని 11 డిపోల నుంచి రోజు వారి రాబడి రూ.1.5 కోట్ల నుంచి రూ.1.6 కోట్ల వస్తోందని వెల్లడించారు. 50 కేజీల లగేజీలు మాత్రమే కార్గో పాయింట్ నుంచి 10 కిలోమీటర్ల దూరం అందిస్తున్న తరుణంలో రాబోవు రోజుల్లో వాటి పరిధిని విస్తరించాలని చెప్పారు. తిరుపతి డీఎం బాలాజీ, ఏటీఎం డీఆర్ నాయుడు పాల్గొన్నారు.

డ్రైవింగ్ ట్రాక్‌లో సెన్సార్ ఏర్పాటు



సెన్సార్ పనులను పరిశీలిస్తున్న డీటీసీ, ఎంవీఐలు

తిరుపతి మంగళం : ఆర్టీఏ తిరుపతి రవాణాశాఖ కార్యాలయ ఆవరణంలోని డ్రైవింగ్ ట్రాక్‌లో సెన్సార్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం డీటీసీ మురళీ మోహన్, ఎంవీఐలు సుబ్రమణ్యం, స్వర్ణలత తదితరులు సెన్సార్ పనులను పరిశీలించారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు సెన్సార్ ఏ విధంగా పనిచేస్తుందన్న విషయాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సెన్సార్‌కు పక్కన సోకినా ఫెయిల్ చేస్తుందన్నారు. ఇప్పటికే చిత్తూరులోని రవాణాశాఖ కార్యాలయంలోని ఇలాంటిదే ఏర్పాటు చేశారని చెప్పారు.

రూ.6 లక్షలకుపైగా రికవరీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

భాకరాపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రూ.6,43,172 రికవరీ చేయగా.. అపరాధం కింద రూ.1,06,000 చెల్లించేలా చర్యలు చేపట్టినట్టు డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. చిన్నగొట్టిగల్లులోని జగనన్న సమావేశ మందిరంలో శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు 13 పంచాయతీల్లో జరిగిన 1,880 పనులకు రూ.5.34 కోట్లు వ్యయం చేసినట్టు వెల్లడించారు. వీటికి సంబంధించిన పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి తనిఖీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు రికవరీ కింద రూ.6,43,172, అపరాధం కింద రూ.1,06,000 చెల్లింపులు చేపట్టినట్టు తెలిపారు. ఎంపీడీఓ గిడ్డయ్య పాల్గొన్నారు.

నేడు న్యాయమూర్తులకు వర్క్‌షాప్



తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు శనివారం చిత్తూరులో క్రిమినల్ చట్టాలపై వర్క్ షాప్ నిర్వహించనున్నట్టు జిల్లా కోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు చిత్తూరు కోర్ట్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో న్యాయమూర్తులకు క్రిమినల్ చట్టాలు, ప్రాక్టీసు, ప్రొసీజర్ అనే అంశంపై అవగాహన కల్పించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ ను నిర్వహించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులు ఈ వర్క్ షాప్‌నకు వెళ్లనుండడంతో శనివారం మాత్రం అత్యవసర ఎఫ్ఐఆర్, రిమాండ్, మరణ వాంగ్మూలాలను ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్లు తీసుకొని విచారించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నాపేరు వై.వంశీ. కోట మండలం, విద్యానగర్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి విదేశాల్లో చదవాలని ఆశ ఉండేది. గత ప్రభుత్వంలో విదేశాలలో చదువుకోవాలనే ఆలోచన ఉన్న పేదపిల్లలకు ప్రభుత్వమే నేరుగా విదేశాలకు పంపడంతోపాటుగా వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేది. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో నా ఆశ అడియాశ అయ్యింది.



నేను చిన్నగొట్టిగల్లు జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నా. నా పేరు ఎం.యుగంధర్. నేను ఏడో తరగతి చదువుతున్నప్పుడు మా స్కూళ్లో 8వ తరగతి చదివే వాళ్లకు ట్యాబులు పంపిణీ చేశారు. నెక్ట్స్ ఇయర్ నేను కూడా ట్యాబు తీసుకుంటానని ఆశపడ్డా. కానీ జగన్ మామయ్య సీఎం కాలేదుగా.. అందుకే మాకు ట్యాబులు ఇవ్వలేదు. మేము అంత డబ్బులు పెట్టి ట్యాబులు కొనుక్కోలేక పోతున్నాం. నాకు ట్యాబ్‌లో చదువుకునే అదృష్టం లేదు.

- జాడలేని విద్యార్థుల ట్యాబ్‌లు
- డిజిటల్ బోధనకు ప్రాధాన్యమివ్వని కూటమి పెద్దలు
- ఉన్నత చదువుకు దూరమవుతున్న పేద పిల్లలు
- ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- మెరుగైన విద్యాప్రమాణాలకు గత ప్రభుత్వం అడుగులు



నాడు

'ప్రతి పేద వాడు ఉన్నత చదువులు చదువుకోవాలి. ప్రతి ఇంటి నుంచి పెద్దపెద్ద ఇంజినీర్లు, డాక్టర్లు బయటకు రావాలి. వారి ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉండకుండా చర్యలు చేపట్టాలి. ఎన్ని అడ్డంకులున్నా విద్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి..' అన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. గతంలో కార్పొరేట్‌కు సాగిలపడిన విధానాన్ని పూర్తిగా మార్చేసింది. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చింది. రుచికరమైన జగనన్న గోరుముద్ద.. ఆహ్లాదకరంగా ఉండేందుకు నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు సర్వోన్నతంగా తీర్చిదిద్దింది. ప్రస్తుత సాంకేతికరంగంలో పేద పిల్లలు కూడా ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా డిజిటల్ బోధనకు మెరుగులు అద్దింది. బైజూస్‌తో కూడిన ట్యాబులు.. క్లాస్ రూమ్‌ల్లో డిజిటల్ పాఠాలకు బీజం వేసింది. విద్యార్థుల తల్లలకు అమ్మఒడి పేరుతో ఆర్థిక చేయూతనందించింది. వసతి దీవెన, విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉచిత చదువులకు శ్రీకారం చుట్టింది. పేదలపై ఎలాంటి భారం లేకుండా చదువులు సాగేలా చర్యలు చేపట్టింది.

నేడు

రాష్ట్రంలో ఆరు నెలల క్రితం కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం చదువుపై దృష్టి సారించలేకపోయింది. పిల్లలకు పౌష్టికాహారం నుంచి.. సాంకేతిక విద్య వరకు అన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేసింది. పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకోనీయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోంది. ఇదిచాలదన్నట్టు ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ పరోక్షంగా కార్పొరేట్‌కు ఎరతివాచీ పరుస్తోంది. విద్యార్థులకు అమలుకావాల్సిన తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన వంటి పథకాలను పక్కన పెట్టేసింది. 8వ తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్యాబులకు పూర్తిగా మంగళం పాడేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులను విస్మరిస్తూ చుక్కలు చూపిస్తోంది. ఇటు ప్రభుత్వ విద్యారంగాన్ని, అటు విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా తల్లిదండ్రులపై పెను భారం మోపుతోంది.



రేణిగుంట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థినులు (ఫైల్)

జగనన్న యజ్ఞం నేడు భగ్నం



మాది తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండలం. నా పేరు సునీత. మా అబ్బాయి నాగలాపురం మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్ మెంట్ జమకాలేదు. గత ప్రభుత్వంలో ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ జమయ్యేది. కూటమి ప్రభుత్వంలో ఆ ఊసే లేదు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు పెడుతామని కళాశాల యాజమాన్యం బెదిరిస్తోంది.



నాపేరు కే.ఈశ్వరమ్మ. మాది రేణిగుంట. గతంలో మా ఊళ్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు –నేడు పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. చాలా పాఠశాలల్లో అదనపు తరగతి గది నిర్మాణాలు నిలిచిపోయాయి. అప్పట్లో స్కూళ్లల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయించాలి.

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి ఎడ్యుకేషన్ : పేద విద్యార్థికి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించాలన్న సత్సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. ప్రభుత్వ విద్యావిధానంలో సంచలన మార్పులు తీసుకొచ్చారు. కోట్లాది రూపాయలతో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశ పెట్టారు. ప్రతి విద్యార్థీ చదువుకోవాలన్న సంకల్పంతో అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక వంటి వినూత్న సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. నూతన విద్యావిధానాన్ని పటిష్టంగా అమలుచేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. కానీ ఇప్పుడు అవేవీ కనిపించకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరినాక కక్షసాధింపులకు దిగి పేద విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేసింది.

గుదిబండలా ఫీజు రీయింబర్స్‌మెంట్

కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు గుదిబండలా పేరుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా 1,15,348 మంది విద్యార్థులకు రూ.214.24 కోట్ల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఫీజులు చెల్లించలేక చదువులు మానేసి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

తిరుపతి జిల్లా వివరాలు (గత ఐదేళ్లలో విద్యాభివృద్ధి పథకాలు, లబ్ధి)

పథకం పేరు	లబ్ధిపొందిన వారి సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లల్లో
ఉచిత ట్యాబులు	38,519	రూ.132.38
విద్యాదీవెన, వసతిదీవెన	4,15,25	రూ.1045.24
గోరుముద్ద	9,37,220	రూ.715.10
విద్యాకానుక	9,37,220	రూ.158.24
అమ్మఒడి	9,37,220	రూ.1405.83
నాడు-నేడు	2,004 పాఠశాలలు	రూ.715.04
మొత్తం		రూ.4171.83

పంపిణీ చేసిన ట్యాబుల వివరాలు

సంవత్సరం	ట్యాబులు
2022-23	21,422
2023-24	17,097
2024-25	41,372 (ట్యాబులు అందుకోవాల్సి ఉంది)

మౌలిక వసతులకు చిల్లిగవ్వలేదు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 2,354 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు చేసుకోవాలన్నా హెచ్ఎంల వద్ద చిల్లిగవ్వ కూడా లేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న 6,785 మంది ఆయాలకు గత ఎనిమిది నెలలుగా జీతాలు కూడా మంజూరు చేయని పరిస్థితి నెలకొంది.

సాంకేతిక చదువు

టెక్నాలజీని జోడించి విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యారంగానికి పురుడు పోసింది. బైజ్యూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాంసంగ్ ట్యాబుల్లో బైజూస్ కంటెంట్‌ను ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో నిక్షిప్తం చేసింది. దాదాపు రూ.32వేల విలువైన ట్యాబులను 8వ తరగతి విద్యార్థులకు, అలాగే ఉపాధ్యాయులకు అందించింది. తద్వారా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం రెట్టింపయ్యింది. పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను అందించి డిజిటల్ విద్యకు పెద్దపీట వేసింది. అయితే ప్రస్తుతం విద్యార్థులకు అందించే ట్యాబుల కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది.



చిత్తూరులో అమ్మఒడి నిధులు విడుదల చేస్తున్న నాటి సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

అమ్మఒడికి పంగనామాలు

బడి ఈడు పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చింది. ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో ఏటా రూ.15 వేలు జమచేసింది. ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని దిగ్విజయంగా అమలుచేసింది. తిరుపతి జిల్లాలో 2,20,890మంది విద్యార్థులకు ఏటా రూ.331.34కోట్లు చొప్పున ఐదేళ్ల పాటు దాదాపు రూ.1,657కోట్లు జమచేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనం అని పేరు మార్చి చేతులు పైకెత్తేసింది.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి



పాఠశాలకు వెళ్లి చదువుకున్న ప్రతి విద్యార్థికీ ఇస్తామన్న తల్లికి వందనం పథకాన్ని పక్కాగా అమలు చేయాలి. ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు.

– లక్ష్మి, విద్యార్థి తల్లి, వెంకటగిరి

ఫీజురీయింబర్స్‌మెంట్ నగదు జమకాలేదు



నా కుమార్తె సరయు తిరుపతి జిల్లా, రంగంపేట వద్ద ఉన్న మోహన్‌బాబు యూనివర్సిటీలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మొదటి ఏడాది ఫీజు మొత్తం గత ప్రభుత్వం జమచేసింది. ఇప్పుడు ఫీజు రియింబర్స్‌మెంట్ కింద నగదు జమ కావాల్సి ఉంది. ద్వితీయ సంవత్సరం పూర్తయి తృతీయ సంవత్సరానికి అప్‌డేట్ కావాల్సి ఉంది. కళాశాల నుంచి ఫీజు చెల్లించమని ఫోన్లు వస్తున్నాయి. ఫీజ రియింబర్స్‌మెంట్‌లో మొదటి సంవత్సరం నగదు జమైందని, ద్వితీయ సంవత్సరం ఫీజులు పడలేదు కాబట్టి ముందు కట్టేయండి. ప్రభుత్వం నుంచి నగదు జమైన తరువాత తీసుకుందురని చెబుతున్నారు. ఏం చేయాలో పాలుపోవడంలేదు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోయింది.

– జడి సౌభాగ్యం, దొరవారిసత్రం

ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు



నేను టైలరింగ్ చేసి పిల్లలు ఇద్దరిని చదివించుకుంటున్నాను. నా భర్త వదిలేసి వెళ్లినప్పటికీ ఇద్దరి పిల్లలను గత ప్రభుత్వం ఇచ్చిన అమ్మఒడి పథకంతో ఉన్నత చదువులు చదివించాను. ప్రస్తుతం కుమారుడు గూడూరు ఆదిశంకర కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఆఖరి సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ జమకాలేదు. కళాశాల వాళ్లు రోజూ అడుగుతున్నారు. కుమార్తె ఇంటర్ పూర్తి చేసుకుని బీఫార్మశీ చేయడానికి కౌన్సెలింగ్ వెళ్లింది. గత ప్రభుత్వంలో అన్నీరు ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో చదువులను గాలికొదిలేశారు. పిల్లలను చదివించుకోలేక మాలాంటి పేదల బతుకులు వీధినపడేటట్టు ఉన్నాయి. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు విడుదల చేయాలి.

– కోన నాగజ్యోతి, సూళ్లూరుపేట

ట్యాబ్‌తో వికాసం



గతంలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబుల ద్వారా అభ్యసనా సామర్థ్యం మెరుగుపడింది. అయితే ట్యాబులు పక్కదారిన పడుతోందంటూ వాటిని ఇవ్వడం మానేయడం సరికాదు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.బాలాజీ, రాష్ట్ర అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్)



గోవిందా.. ఇదేమైనా బాగుందా?

తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారికి మాత్రమే గొడుగులు ఉపయోగిస్తారు. సామాన్య భక్తుల వద్ద ఉన్న గొడుగులు, ఇతర వస్తువులను వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకుంటారు. ప్రభుత్వంలో పెద్ద సారు రావడంతో.. టీటీడీ ఈ నిబంధనలను తుంగలో తొక్కింది. శుక్రవారం ఏకంగా శ్రీవారి ఆలయం బంగారు వాకిలి వద్దే గొడుగుని వినియోగించారు. దీన్ని చూసిన భక్తులు ఇదేంది గోవిందా.. ప్రముఖులు వస్తే ఉన్నతాధికారులకు నిబంధనలు ఉండవా..? అంటూ చర్చించుకుంటున్నారు. స్వయానా ఈ ఫొటోను టీటీడీ పీఆర్వో విభాగం విడుదల చేయడం గమనార్హం. – తిరుమల

ఊర్లో లేని వారి పేర్లు మస్టర్లో!

- కలువాయి మండలంలో భారీ అవినీతి
- రూ.58 లక్షలకుపైగా స్వాహా
- ఊర్లో లేని వారి పేర్లు రాసి డబ్బులు నొక్కిన వైనం
- ఆరుగురు ఉపాధి స్టిబందిపై క్రిమినల్ కేసులకు సిఫార్సు

కలువాయి: కలువాయి మండలంలో ఆరుగురు ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం స్థానిక పోలీసులను ఆదేశించారు. చినగోపవరం ఎఫ్ఏ మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పీ.బాబు రాజేష్, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ.ప్రసాద్, వెం.వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జే.శ్రీనయ్యపై ఫిర్యాదు చేశారు. 2022–23లో జరిగిన ఉపాధి పనుల్లో రూ.58 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు 16వ విడత సామాజిక తనిఖీల్లో వెలుగులోకి రావడం, అనంతరం విచారణలో అది నిజమని తేలడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు ఉన్నతాధికారులు సిఫార్సు చేశారు. వారిపై పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు ఫైల్ చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తమకు పంపాలని డ్వామా నెల్లూరు జిల్లా కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పంపిన ఆదేశాలు శుక్రవారం తనకు అందినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈమేరకు తాను కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.



వివరాలు తెలియజేస్తున్న ఎంపీడీఓ

భారీగా అవినీతి

కలువాయి మండలంలో 2022–23 మధ్య కాలంలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అవినీతి చోటుచేసుకుంది. ఒక్క చినగోపవరం పంచాయతీలోనే రూ.50 లక్షల మేర అవినీతి జరిగింది. దీనిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి భవానీ హర్ష విచారణ జరిపారు. గ్రామంలో లేని 148 మందిని మస్టర్లలో ఎక్కించి వారి పేరున బిల్లులు చెల్లించి ఎఫ్ఏ మహేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ అకౌంట్స్ అసిస్టెంట్ పీ.బాబు రాజేష్ రూ.25.5 లక్షలు అవినీతికి పాల్పడినట్లు బయటపడింది. వారు ఎవరూ ఆ గ్రామానికి చెందిన వారు కాకపోవడం, పలు రాష్ట్రాలలో ఉన్న వారి అకౌంట్లకు నగదు జమైనట్టు తేలింది. అదే కాలంలో ఇక్కడ టీఏలుగా పనిచేసిన ఆర్.ప్రసన్న, ఎంవీ.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జే.శ్రీనయ్య మరో రూ.32.87 లక్షల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తేల్చారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులకు నివేదికను అందజేయడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అంబుడ్స్‌మెన్ పాత్ర కీలకం

కలువాయి మండలం, చినగోపవరం ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని వెలుగులోకి తేవడంతో అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి కీలకపాత్ర పోషించారు. గ్రామంలో జరిగిన ప్రతి పనిపైనా నిఘా పెట్టారు. ఉపాధి కూలీలతో మమేకమై ఇక్కడ జరిగిన అవినీతిని వెలుగులోకి తెచ్చారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.77,810
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,040
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.88,000
రిటైల్ వెండి గ్రాము రూ.91.00

క్లుప్తంగా

ముగిసిన శిక్షణ


సీనియర్ ట్రైనీలను సన్మానిస్తున్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవ సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి శ్వేత భవనంలో గత ఐదు రోజులుగా న్యాయమూర్తులకు జరిగిన మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ శిక్షణ తరగతుల్లో చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఢిల్లీకి చెందిన మాజీ న్యాయమూర్తి హరీష్ దుడాని, మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ న్యాయమూర్తి గిరిబాలసింగ్ శిక్షణ ఇచ్చారు. వీరిని తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి జీ.రామ్‌గోపాల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతి పాల్గొన్నారు.

23న తిరుపతిలో భక్త సమ్మేళన వేడుకలు



మాట్లాడుతున్న పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద

తిరుపతి కల్చరల్ : రామకృష్ణ–వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తిరుపతి– తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో 6వ భక్త సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు స్వామి సుకృతానంద తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వేడుకల్లో దేశంలోని రామకృష్ణ మఠాలు, మిషన్లకు చెందిన 12 మంది ప్రముఖ స్వామీజీలు, మాతాజీలు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అధికారంతో తమ్ముళ్ల అరాచకం

- పచ్చని చెట్లపై పచ్చనేతల ప్రతాపం
- వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన మామిడి చెట్లు నేలమట్టం
- పొలానికి వేసిన కంచెను కూల్చేసిన వైనం
- భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


మామిడి మొక్కలను నాశనం చేసిన దృశ్యం



భాకరాపేట: అధికార మదంతో తెలుగు తమ్ముళ్లు అరాచకం సృష్టిస్తున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ నేతలపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. వారి వ్యవసాయ భూములపై విచక్షణా రహితంగా విరుచుకు పడుతున్నారు. ఇలాంటి ఘటనే చిన్నగొట్టిగల్లు మండలం, భాకరాపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక సర్పంచ్, మాజీ సైనికుడు సాకిరి భూపాల్ వైస్సార్‌సీపీ మద్దతుదారుగా ఉంటూ గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేశారు. దీన్ని జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నేతలు అతనిపై పలుమార్లు దాడికి ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో అతని వ్యవసాయ క్షేత్రంపై విరుచుకుపడ్డారు. మామిడి మొక్కలను విరిచేశారు. మామిడి తోటకు కంచెగా నిర్మించిన రాతి స్తంభాలను ధ్వంసం చేశారు.

మాజీ సైనికుడు అన్న గౌరవం కూడా లేదు

సాకిరి భూపాల్ రాజకీయాల్లోకి రాకముందు భారత సైన్యంలో పనిచేశాడు. పదవీ విరమణ చెందిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన భూమిలో మామిడి, కొబ్బరి, టేకు చెట్లను సాగుచేసుకుంటున్నాడు. మాజీ సైనికుడు అన్న గౌరవం కూడా లేకుండా పచ్చ పార్టీ నేతలు ఇలా పచ్చని చెట్లను నరికి వేయడం పట్ల స్థానికులు రగిలిపోతున్నారు.

రూ.50 లక్షలకు మేర నష్టం

భూపాల్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో 270 మామిడి చెట్లు, 220 టేకు చెట్లు, 12 కొబ్బరి చెట్లు, 3 సోలార్ సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయాడు. సుమారు రూ.50 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు బాధితుడుని పరామర్శించారు. చట్ట ప్రకారం పోరాడుదామని ధైర్యం చెప్పారు.

భూపాల్‌కు అండగా ఉంటాం

‘భూపాల్ పంట పొలాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. పచ్చని చెట్లను నరకడానికి వారికి మనసు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. ఇలా రాజకీయ కక్షలతో పంటలను ధ్వంసం చేయడం చంద్రగిరి చరిత్రలో జరగలేదు. పోలీసులు వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి. లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతాం. బాధితుడు భూపాల్‌కు అండగా నిలబడతాం’

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్

కక్ష సాధింపు చర్యలు ఆరంభం


స్వాధీనం చేసుకున్న భూమిలో కాలువ తీస్తున్న అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగింది. ఆయా పార్టీలకు చెందిన కొందరి నేతల ఒత్తిళ్లతో ఓ రైతు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న ఆరున్నర ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడం రాపూరు మండలంలో చర్చనీయాంశమైంది. మండలంలోని సంక్రాంతిపల్లి సమీపంలో ఓ వైఎస్సార్‌సీపీ నాయకుడికి చెందిన వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో ప్రభుత్వానికి సంబంధించిన వాగు వెళ్తోందని, దాన్ని ఆక్రమించుకున్నారన్న ఆరోపణలతో రెవెన్యూ అధికారులు జేసీబీ యంత్రాలతో ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఆ రైతుకు ఈనెల 2వ తేదీన నోటీసులు అందించామని, అయినా ఆయన స్పందించకపోవడంతో సర్వే అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. రెవెన్యూ చట్టం ప్రకారం రైతు ఏర్పాటు చేసుకున్న కంచెను తొల

శానంబట్లలో మైనింగ్ అధికారుల దాడులు

– హిటాచీతో పాటు ట్రాక్టర్లు, టిప్పర్ సీజ్


వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన మైనింగ్ అధికారులు

చంద్రగిరి: అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్న వారిపై మైనింగ్ అధికారులు దాడులు చేసిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని శానంబట్ల సమీపంలోని స్వర్ణముఖినది వద్ద చోటు చేసుకుంది. గత కొంత కాలంగా శానంబట్ల, నరసింగాపురం కేంద్రంగా భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మైనింగ్ అధికారులు దాడులు చేపట్టారు. ఇసుక తోడుతున్న హిటాచీ, రెండు ట్రాక్టర్లు, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆపై వాటిని చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులునమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే

ఇసుక అక్రమ రవాణా మండల వ్యాప్తంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నరసింగాపురం గ్రామంలో ఏకంగా ఆర్డీఓకు ఇసుక దోపిడీపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో ఆగమేఘాలపై అధికారులు మొక్కుబడిగా దాడులు చేపట్టి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాగయ్యగారిపల్లి, నరసింగాపురం, చంద్రగిరి, బుచ్చినాయుడుపల్లి స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి


ఖాదీ వస్త్రాల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

చంద్రగిరి: ఖాదీ మహోత్సవ ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని, ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మార్కెటింగ్, పీఎంఈపీ–ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి పట్టణంలోని శిల్పారామంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి వచ్చి వారి ఉత్పత్తులు ప్రదర్శించి అమ్మకాలు జరుపుతున్నారని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిల్పారామంలో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కేవీఐసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కేవీఐసీ డిప్యూటీ సీఈఓ సౌత్ జోన్ మదనకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేవీఐసీ సంస్థ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్ ప్రైజెస్ కింద 1956లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీని ద్వారా గ్రామీణ ఉత్పత్తులు, ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ శాఖ ద్వారా 26 డిపార్ట్‌మెంటల్ సేల్స్ ఔట్ లెట్స్, 88 వేల రిటైల్ సేల్స్ ఔట్ లెట్స్, 5 సెంట్రల్ ప్లాంట్స్ ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.గ్రీప్, ఏడీ కోటిరెడ్డి, పద్మావతిపురం సర్పంచ్ జ్యోతి, లీడ్ బ్యాంకు మేనేజర్ విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ పాల్గొన్నారు.

కాలుజారిందా.. ఆత్మహత్యా యత్నమా?

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ధర్మవరానికి చెందిన విద్యార్థి హాస్టల్ భవనం మూడో అంతస్తు నుంచి కిందకి దూకాడు. ఇది ఆత్మహత్యా యత్నమా... కాలు జారి పడ్డాడా అనే విషయం తెలియాల్సి ఉంది. శుక్రవారం ఉదయం 4.30 సమయంలో హాస్టల్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకినట్లు విశ్వసనీయ సమాచారం. వెంటనే సహచర విద్యార్థులు గుర్తించి హాస్టల్ అధికారులకు సమాచారం అందించారు. నడుం భాగంలో ఎముక దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానిక వైద్యులు తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి, వెంటనే ప్రత్యేక వాహనంలో ఆ విద్యార్థిని సీఎంసీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

42 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న కేసుల్లో 42 మందికి నాలుగు లక్షల 20 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు కోర్టు సూపరింటెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. ఇదివరలో ఎన్నడూ లేనంత విధంగా 42 మందికి నాలుగు లక్షల 20వేల రూపాయలు కోర్టు జరిమానా విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఆలయ ఏఈ రాజీనామా!

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఇంజినీరింగ్‌శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తన రాజీనామాను తపాలా ద్వారా అందజేసినట్లు తెలిసింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏడేళ్లుగా విధులుగా నిర్వహిస్తున్నారు. అయితే గురువారం జరిగిన అంతర్గత బదిలీల్లో తనకు ప్రాధాన్యత లేని విభాగానికి బదిలీ చేయడంతో రాజీనామా చేసినట్లు సమాచారం. దీనిపై ఈఓ బాపిరెడ్డిని వివరణ కోరగా దానిపై పరిశీలించి ఏఈతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

వెంకటగిరి రూరల్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ఓజిలి మండలం ఇనుగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు, అతడికి సహకరించిన కొగిలి సుబ్రహ్మణ్యం, యల్లంటి వెంకటయ్య, మంగుళూరు వాణిలకు శిక్ష పడింది. పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఓ బాలిక బాలాయపల్లిలోని స్కూల్లో పదో తరగతి చదివేది. సుబ్బారావు జయంపు గ్రామంలో ఫర్టిలైజర్స్ దుకాణంలో పనిచేసేవాడు. అతను బాలికతో పరిచయం చేసుకుని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పైనిందితుల సహాయంతో 2015 సంవత్సరంలో బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు బాలాయపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు అనంతరం నిందితులపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున కాకుటూరు రమేష్‌రెడ్డి వాదించారు. నిందితులకు కఠిన శిక్ష పడేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎస్సీ, ఎస్టీ సెల్ డిప్యూటీ ఎస్పీ శ్రీనివాసులు, గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, బాలాయపల్లి ఎస్ఐ కె.గోపిలను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారన్నారు.

పుట్టాలమ్మ సేవలో అమెరికా బృందం


సంతవేలూరులో ప్రముఖ రోబోటిక్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమిత్ కిషోర్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామ దేవత పుట్టాలమ్మ ఆలయాన్ని అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ప్రముఖ రోబోటిక్ హార్ట్ సర్జన్ డాక్టర్ అమిత్ కిషోర్, ఆయన బృందం శుక్రవారం దర్శించుకుంది. గతంలో పుట్టాలమ్మ ఆలయ నిర్మాణ సందర్భంలో డాక్టర్ అమిత్ కిషోర్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారత్ పర్యటనలో భాగంగా సంతవేలూరు గ్రామానికి వచ్చి పుట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఆలయ వ్యవస్థాపకులు, అమెరికా పౌరుడు డాక్టర్ మాయాని చెంచుమునస్వామి రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,165 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,377 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సుబ్రమణ్యం (ఫైల్)

శ్రీకాళహస్తి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి తొట్టంబేడు మండలం, బోనుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం.. గ్రామానికి చెందిన జలగం ఆదెమ్మ కుటుంబంలో ఆస్తి తగాదాలున్నాయి. ఇటీవల బోనుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జలగం ఆదెమ్మ రెండో కుమారుడు జలగం మణి(52) శుక్రవారం రాత్రి అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. అయితే మణిపై ఎవరో దాడి చేయడం వల్లే మృతి చెందినట్లు ఆయన తమ్ముడు ఆనంద్ ఆరోపించారు. తాము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని, రాజకీయ కక్షతోనే టీడీపీ నాయకులు తమపైన కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. తనను పోలీస్ స్టేషన్లో నిర్బంధించి బోను పల్లికి వెళ్లకుండా చేశా రని ఆరోపించారు. ఈ విషయంపై తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్యను వివరణ కోరగా తమకు మృతుడి బంధువుల తరఫు నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఉపాధి నిధులు బొక్కిన అనకొండలు

- అరకోటి నిధులు స్వాహా
- నిగ్గుతేల్చిన అధికారులు


విచారణ చేస్తున్న అధికారులు

సైదాపురం: ఇతర రాష్ట్రాల్లో ఉన్న పేర్లతో హాజర్లు వేసుకున్నారు. భారీ యంత్రాలతో ఉపాధి పనులు చేపట్టారు. ఉద్యోగులకు కూడా హాజరు వేసి ఉపాధి నిధులు బొక్కేశారు. ఇలా రూ.59 లక్షల వరకు దిగమింగేశారు. ఈ మేరకు సైదాపురం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన 16వ సామాజిక తనిఖీ బృందాలు ప్రజావేదికలో అధికారులు ఆ వివరాలు వెల్లడించారు.

రూ.59 లక్షల వరకు రికవరీ

సైదాపురం మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 8 కోట్ల 80 లక్షల రూపాయల మేర ఉపాధి పనులు జరిగాయని పీడీ గంగాభవాని, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. వారు మాట్లాడుతూ సామాజిక బృందం సభ్యులు నిర్వహించిన తనిఖీల్లో సిబ్బంది నుంచి 59 లక్ష 8 వేల రూపాయలను రికవరీ చేయనున్నట్టు పేర్కొన్నారు. చీకవోలు, అనంతమడుగు, ఆర్‌ఆర్‌పురం, గిద్దలూరు, తురిమెర్ల తదితర గ్రామ పంచాయతీల్లో అధిక మొత్తం నిధులు దుర్వినియోగమైనట్టు వెల్లడించారు. కొలతలు కూడా సక్రమంగా తీయలేదని రాగనరామాపురం సర్పంచ్ ఉషా నరసమ్మ ఉపాధి హామీ పనులకు సంబంధించి పీడీకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఏపీడీ శంకర్‌నారాయణ, క్వాలిటీ కంట్రోల్ డీఈ సతీష్‌బాబు, అంబుడ్స్‌మెన్ వెంకట్రారెడ్డి, ఎంపీడీఓ పురుషోత్తంశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారు జైలుకే

ఉపాధి హామీ పథకం నిధులు కాజేసే సిబ్బందిపై ఇక నుంచి జైలుకే పంపడం జరుగుతుందని నెల్లూరు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని వెల్లడించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి 15 రోజులకొకసారి క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కమిటీలతో విచారణ కూడా చేయిస్తామన్నారు. జాబ్‌కార్డుల విషయంలో సమగ్ర విచారణ చేస్తామన్నారు. నిధులు కాజేసిన పంచాయతీల్లో విజిలెన్స్ విచారణ చేసి తదనంతరం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 15 విడతల్లో సైదాపురం మండలంలో జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.80 లక్షల వరకు రికవరీ చేయాల్సి ఉండగా.. అందులో ఇంకా రూ.22 లక్షలు రావాల్సి ఉందన్నారు.

ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి రూ.6.3 కోట్లు


నాయుడుపేటలో బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీ చెన్నయ్య

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లాలోని 55 ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.6.3 కోట్లు మంజూరు చేసినట్టు సాంఘిక సంక్షేమశాఖ జిల్లా డెప్యూటీ డైరెక్టర్ కే.చెన్నయ్య తెలిపారు. పట్టణంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం, ఎస్సీ బాలికల 1, 2 వసతి గృహాలను డీడీ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం –1కి రూ.14.69 లక్షలు, బాలికల వసతి గృహం–2కి రూ.16.13 లక్షలు, మేనకూరు ఎస్సీ బాలుర వసతి గృహానికి రూ.9 లక్షలు, దొరవారిసత్రం మండలం ఏకొల్లు వసతి గృహానికి రూ.18.38 లక్షలు, సూళ్లూరుపేట బాలుర వసతి గృహానికి రూ.15.7 లక్షలు మంజూరైనట్టు వెల్లడించారు. నాయుడుపేట పట్టణంలో అద్దె భవనంలో నడుస్తున్న ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని డీఎస్పీ కార్యాలయ సమీపంలో ఉన్న తమ శాఖకు చెందిన భవనాల్లోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూ సీహెచ్.సుధామయి, వసతి గృహాల వార్డెన్లు ఎస్ సరితా, ఉమా తదితరులు ఉన్నారు.

యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నా పట్టించుకోరా?

- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- రెవెన్యూ సదస్సులో ఆర్డీఓను నిలదీసిన గ్రామస్తులు



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్, ఇసుక అక్రమ రవాణాపై ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తుడు

చంద్రగిరి: ‘ఉచితం మాటున ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. తమ గ్రామ పరిధిలో రాత్రింబవళ్లు హిటాచీ, జేసీబీలతో టిప్పర్ల ద్వారా వందలాది లోడ్లు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు’ అంటూ మండలంలోని నరిసింగాపురం గ్రామస్తులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ రామ్మోహన్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సచివాలయం వద్దకు చేరుకున్నారు. స్వర్ణముఖినదిలోని ఇసుకను అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు యంత్రాలతో తవ్వేస్తున్నారని ఆరోపించారు. నరిసింగాపురం పరిధిలోని రైల్వేస్టేషన్, మసీదు సమీపం, దింపుడుగల్లం వద్ద నిరంతరాయంగా ఇసుక స్మగ్లింగ్ సాగుతోందన్నారు. ఫలితంగా గ్రామంలోని రోడ్లన్నీ దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటి నిర్మాణానికి కూలీల ద్వారా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిబంధనలను విధించిందని, అయితే వాటికి విరుద్ధంగా యంత్రాలతో రాత్రుల్లో సైతం ఇసుకను దోచేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కొంతమంది రాత్రుల్లో రౌడీలను వెంటబెట్టుకుని ఇసుకను దోచుకుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్డీఓ ఇసుక అక్రమ రవాణాపై వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివరామసుబ్బయ్యను ఆదేశించారు. అదనపు రెవెన్యూ సిబ్బందిని నియమించి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటికే మద్యం బండి వచ్చిందోచ్!



ఆటోలో మద్యం బాక్సులు పెట్టుకుని విక్రయాలు చేస్తున్న వ్యాపారులు, మద్యం విక్రయాలు చేపట్టే ఆటో

చిట్టమూరు (చిల్లకూరు): సాధారణంగా కూరగాయలు, ఇతర సామగ్రిని ఆటోల ద్వారా వ్యాపారులు పల్లెల్లో విక్రయించడం చూస్తుంటాం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటింటికీ మద్యం పాలసీని అమలు చేస్తోంది. పల్లెల్లో ఆటోల ద్వారా విక్రయాలు చేసేలా ‘మద్యం బండి వచ్చిందోచ్’.. అని అనౌన్స్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనే శుక్రవారం చిట్టమూరు మండలం, మొలకలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. చిట్టమూరు మండలంలో నాలుగు మద్యం షాపులు ఉండగా అధికార పార్టీ నాయకులు వాటిని దక్కించుకున్నారు. షాపుల్లో విక్రయాలు తక్కువగా ఉండడంతో సిండికేట్‌గా ఏర్పడి ప్రతి గ్రామంలో బెల్టు షాపులకు తెరలేపారు. ఇంకో వైపు ఆటోల్లో ఇంటింటికీ మద్యం పంపిణీ చేసేలా ఆటోల్లో గ్రామగ్రామానికీ తిప్పుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా.. మొలకలపూడి గ్రామంలో ఆటోలో మద్యం విక్రయాలు చేశారన్న విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి చర్యలు చేపడుతామని సెలవిచ్చారు.